

# ఏటి ఒడ్డున నీటిపూలు

## - కొలిపాక రమామణి



రమామణిగారు 29 యేళ్ళ వయసులో వ్రాసిన మొదటి నవల ఈ 'ఏటి ఒడ్డున నీటిపూలు'. పోటీల్లో బహుమతి గెలుచుకుంది. తర్వాత కన్నడపత్రికలో అనువాదమై సీరియల్ గా వచ్చింది. అప్పుడు పుస్తకరూపంలో వెలువడింది. ఆ తర్వాత నాలుగైదు సంవత్సరాల వ్యవధిలోనే 'వెన్నెల్లో పిల్లనగ్రోవి', 'గడ్డిపోచలు','హాలాహలంలో అమృతం' లాంటి పాఠకాదరణ పొందిన నవలలు వ్రాశారు. అప్పటి అన్ని ప్రముఖపత్రికలలోను, ఆకాశవాణికి కథలు కూడా వ్రాశారు.

(గత సంచిక తరువాయి)

ఆంధ్రప్రభ వారపత్రిక ఉగాది నవలల పోటీలో ద్వితీయ బహుమతి పొందిన నవల (1968)

**శ్రీదేవి కాకినాడ వచ్చింది**. ఉత్తరం రాయకుండా హఠాత్తుగా వెళ్లి స్నేహితురాలికి సంతోషం కలిగించాలనుకుంది. సాయంత్రం రిక్షా చేయించుకుని గంజాం వారి వీధికి వచ్చింది.

రిక్షా దిగుతూనే, 'ఇల్లంతా మారిపోయిందే' అనుకుంది శ్రీదేవి, తెరిచి ఉంచిన మొదటి గదిలో ప్రవేశిస్తూ. ఎదురుగుండా పడక కుర్చీ, పక్కనే బల్ల మీద పుస్తకాలు కనిపిస్తున్నాయి. బల్లకి అటువైపు నుంచుని పేపరు తిరగావేస్తున్న రామారావుగారు శ్రీదేవిని చూస్తూనే ఆశ్చర్య పోయారు. "ఇంటివారు కావలిస్తే పక్క సందు గుండా పెరటి వైపు వెళ్ళండి" అన్నారు.

'గది అద్దెకి ఇచ్చారా?' అనుకుంటూ శ్రీదేవి పెరటి వైపు వెళ్ళింది.

వరండాలో మాలతి పిల్లలకి పాఠాలు చెబుతూంది. శ్రీదేవిని చూడగానే సంతోషంగా, "అక్కా! మీ శ్రీదేవి వచ్చింది" అని గట్టిగా కేకవేసి తను లేచి, చాప తీసుకు వచ్చి వేసింది. భానుమతి, చారుమతి గదిలో నించి. శాంతమ్మ వంటింటిలో నించి ఒక్కసారే బయటికి వచ్చారు. శాంతమ్మకి నమస్కారం చేసి, "బాగున్నారా?" అని భానుమతిని పలకరించింది శ్రీదేవి.

చారుమతి ఆప్యాయంగా శ్రీదేవి చెయ్యి పట్టుకుని కూర్చో పెట్టింది.

"ఎప్పుడు వచ్చావు? ఉత్తరమైనా రాయకుండా ఊడిపడ్డావే!"

"నిన్న సాయంత్రం వచ్చాం అమ్మా, నేనూ."

"ఏమిటమ్మా శ్రీదేవీ! ఏదో విశేషం ఉన్నట్టుందే! ఎన్నో నెల?" అంది శాంతమ్మ నవ్వుతూ శ్రీదేవిని ఎగాదిగా చూస్తూ.

శ్రీదేవి సిగ్గు పడుతూ చెప్పింది. "ఏడవనెల."

"కంగ్రాచ్యులేషన్స్!" అంది చారుమతి, శ్రీదేవి చెయ్యి తన చేతిలోకి తీసుకుని, శ్రీదేవి చేతినున్న రంగు రంగుల గాజులు చూస్తూ.

"పురుడు ఎక్కడ పోసుకుంటావమ్మా? ఈ ఊళ్ళో నేనా?" శాంతమ్మ అడిగింది.

"మా నాన్నగారిప్పుడు విశాఖపట్నంలో ఉన్నారు. అక్కడ పెద్ద ఆసుపత్రి ఉంది కదా! అక్కడే పోసుకోవాలనుకుంటున్నాను."

శాంతమ్మ అలాంటి ప్రశ్నలే చాలా అడిగింది. శ్రీదేవి జవాబుగా, తన తల్లి హైదరాబాదులో సూడిదలు ఇచ్చినట్టు, వరంగల్ లో అత్తవారిట్లో సీమంతం చేసినట్టు, ఇప్పుడు విశాఖ తీసుకు వెళుతున్నట్టు చెప్పింది. దారిలో మేనత్త దిగమని రాస్తే రెండు రోజులుండడానికి కాకినాడ వచ్చారు. రేపే తిరిగి విశాఖ వెళుతున్నారు.

"నిరుడు పెళ్లి అయింది. ఈ ఏడు పాపని ఎత్తుకుంటున్నావు. బాగుందమ్మా, మీ పద్మకి కూడా ఏదో విశేషం ఉండే ఉంటుంది. అందరికీ పెళ్ళిళ్ళు అవుతాయి, పిల్లల్నీ కంటారు. మా అమ్మాయిలకే ఏ దిక్కూ కనిపించటంలేదు" అంది శాంతమ్మ దిగులుగా.

అంతా మౌనంగా ఉండిపోయారు కాస్సేపు.

"మీ గది అద్దెకి ఇచ్చారా? నువ్వు నాకు రాయనే లేదు." శ్రీదేవి నిశ్శబ్దాన్ని భంగం చేస్తూ అంది.

"అవును, రామారావుగారని, హైస్కూల్ టీచరు ఆయన. మా ఇంట్లో దిగి ఏణ్ణర్ధం  అయింది." చారుమతి వివరాలు చెప్పింది.

"ఆయన ఉండబట్టే మాకెంతో సహాయంగా ఉందమ్మా. మా శంకరం వెళ్ళిపోయాక మా ఇంట్లో మగదిక్కు అయ్యారు." శాంతమ్మ విచారంగా అంది.

"శంకరం ఎక్కడికి వెళ్ళాడు?"

"నీకు తెలియదు కదూ! శంకరం ఇల్లు విడిచి వెళ్లి ఏడాది అయిపోతూ ఉంది. ఉద్యోగం సంపాదించుకుని వస్తానని వెళ్ళిపోయాడు. ఇప్పటివరకు ఒక్క ఉత్తరం రాయలేదు. ఎక్కడున్నాడో, ఏమైపోయాడో అని అమ్మకి, మామ్మకి దిగులు." చారుమతి పాత సంగతులు తలుచుకుంటూ మాట్లాడింది.

"అయ్యో, నాకు తెలియదు ఈ సంగతి. అన్నట్టు, మీ మామ్మగారు ఎలా ఉన్నారు?'

"రా, చూద్దువుగాని. నువ్వు వచ్చావంటే సంతోసిస్తుంది."

చారుమతి శ్రీదేవిని లోపలి తీసుకుని వెళ్ళింది. ముసలమ్మగారు ముల్లులా మంచం మీద పడుకుని ఉన్నారు. ఆవిణ్ణి చూస్తూనే ఎవరికైనా జాలి వేస్తుంది.

"మామ్మా! శ్రీదేవి వచ్చింది" అంది చారుమతి మంచం దగ్గిరికి వెళ్లి.

"ఎవరూ?" అంటూ కళ్ళు తెరిచింది ఆవిడ. కాని శ్రీదేవిని గుర్తు పట్టలేక పోయింది.

"ఎవరూ?" అంది తెల్లబోయి చూస్తూ.

"శ్రీదేవి... మా స్నేహితురాలు, సూర్యారావు పేటలో ఉండే అమ్మాయి" అంది తిరిగి చారుమతి.

"క్రిందటేడు పెళ్లి అయి, ఇప్పుడు బిడ్డని కనబోతూంది." శాంతమ్మ కూడా దగ్గిరికి వచ్చి చెప్పింది.

"ఆహా, మంచిది. చాలా బాగుంది" అంది ముసలమ్మ మెల్లిగా. తిరిగి "మా మనవడు మమ్మల్ని వదిలి వెళ్ళిపోయాడు చూశావా అమ్మా! దేవుడికి మా మీద దయ లేదు. ఎక్కడున్నాడో ఏమో? తింటున్నాడో, పస్తే ఉన్నాడో! ఆడపిల్లలంతా పెళ్లీడు దాటి పోతున్నారు. ఒక్కళ్ళకీ మొగుడు దొరకలేదు. పెళ్ళిళ్ళు ఎప్పుడౌతాయో! చెట్టంత కొడుకుని మింగి, నేనిలా మంచంలో పడి బ్రతుకుతున్నాను. నారాయణుడికి నా మీద దయ ఎప్పుడు కలుగుతోందో, ఎప్పుడు రమ్మంటాడో?' ముసలమ్మా ఆగి ఆగి అంటున్నమాటలు ఎంతో హృదయవిదారకంగా ఉన్నాయి.

"మామ్మా! నువ్వు పడుకో. మేం వెళతాం" అంది చారుమతి.

శ్రీదేవి వంగి ముసలమ్మ పాదాలు ముట్టుకుని నమస్కారం చేసి, "వస్తాను మామ్మగారూ" అంది.

"సుఖీ భవ! చిరంజీవ! నాలుగు కాలాల పాటు పసుపు కుంకుమలతో బ్రతుకు, కడుపు నిండా కొడుకులను కను." ముసలమ్మ ఆశీర్వదించింది.

శ్రీదేవి కాస్సేపు శాంతమ్మతో, భానుమతితో మాలతితో మాట్లాడి, "వెళతాను" అంటూ లేచింది.

"అప్పుడేనా?" అంది చారుమతి.

"చారూ! సత్యనారాయణమూర్తి  కోవేలకి వెళదాం. వస్తావా?' అంది శ్రీదేవి.

చారుమతి చీర మార్చుకుని బయలు దేరింది. శాతంమ చారుమతిని లోపలి పిలిచి ఒక పళ్ళెం చేతిలో పెట్టి, శ్రీదేవికి ఇవ్వమంది. అందులో కొద్దిగా పసుపు, కుంకుమ, చిన్న కాగితంలో పంచదార వేసి ఉంది.

"కడుపుతో ఉన్నవాళ్ళని వట్టి చేతులతో పంప కూడదంటారు. తీపి పెట్టాలి. మాకున్నదేదో మేం ఇచ్చాం. ఏమీ అనుకోకు, శ్రీదేవీ" అంది శాంతమ్మ.

"ఇవన్నీ ఇప్పుడెందుకండీ?" అంటూనే అన్నీ తీసుకుని, వంగి శాంతమ్మకి నమస్కరించింది శ్రీదేవి.

గుమ్మం దాటబోతూ ఉంటే భగవతి ఇంట్లోకి వచ్చింది. "భగవతీ! నువ్వెప్పుడు వచ్చావు?" అంది శ్రీదేవి ఆశ్చర్యంగా.

"నేను వచ్చి రెండు నెలలు అయింది" అంది భగవతి.

"ఏం చేస్తున్నావు? ఎస్.ఎస్.ఎల్.సి. పాసయ్యావా?"

"పరీక్ష పోయింది."

"అయ్యో! మళ్ళీ పరీక్షకి కట్టవా?"

"లేదు, ఇంక చదవాలని లేదు."

శ్రీదేవి అందరి దగ్గిర సెలవు తీసుకుని చారుమతితో సత్యనారాయణమూర్తి కోవేలకి బయలుదేరింది.

"భగవతి ఏమందో చూశావా? ఇంక పరీక్షకి కట్టదుట. చదవాలని లేదంటుంది." చారుమతే ఎత్తింది సంభాషణ.

"మరేం చేస్తుందిట."

"పెళ్లి చేసుకుంటుందిట. ఏమిటో దేవి! భగవతిని అనవసరంగా విశాఖ పంపించాం అనిపిస్తుంది. అది అక్కడ రెండేళ్ళు ఉండి పోవడం వల్ల, మా కుటుంబంలో కష్టసుఖాలు తెలియలేదు. దాని దృష్టి అంతా పెళ్లి మీదే. పైన ముగ్గురు పెళ్ళికాని అక్కలు ఉన్నారు, వాళ్లకి ముందు పెళ్ళిళ్ళు కావాలి అనే ధ్యాసే లేదు. ఎప్పుడైనా అమ్మ ఆ మాట అంటే, "ఇంతమంది ఆడపిల్లలని ఎందుకు కన్నావమ్మా?" అని అడుగుతుంది. అమ్మ ఎంతో బాధ పడుతుంది. ఇంట్లో రోజూ కూర చెయ్యక పోతే విసుగు; కొంచెం కూర చేస్తే విసుగు. బ్రతకడానికి విసుగే. రేవతక్కా, బావా దీన్ని కష్ట సుఖాలు తెలియకుండా పెంచేశారు. ఇప్పుడు మేం చస్తున్నాం"

మాట్లాడుకుంటూనే కోవెల చేరారు ఇద్దరూ. కోవెల పక్కనే ఉన్న బాలాజీ చెరువు కోవేలకి అందాన్ని ఇస్తూంది. కాకినాడలో మధ్యమధ్యన ఉండే చెరువులు, వంకర లేని తిన్నని విశాలమైన వీథులు ఊరికి ఎంతో అందాన్ని ఇస్తాయి.

కోవెల మెట్ల దగ్గిర ఉన్న కోటలో కొబ్బరికాయ కొన్నది శ్రీదేవి. లోపల ప్రదక్షిణం చేసి, దేవుడి విగ్రహానికి ఎదురుగా వచ్చి, కొబ్బరికాయ కొట్టి, గంట  వాయించి, రెండు చిప్పలు పూజారికి ఇచ్చారు. భగవంతుడికి నమస్కరించి ప్రసాదం తీసుకు వచ్చి కూర్చున్నారు. సత్యనారాయణమూర్తి కోవెల ఎప్పుడూ భక్తులతో నిండుగానే ఉంటుంది. ముఖ్యంగా విధ్యార్థులకి ఈ దేవుడి మీద చాలా నమ్మకం. పరీక్ష రాసే ముందు విధిగా దేవుడికి కొబ్బరికాయ కొట్టి ప్రసాదం, కుంకుమ తీసుకుని వెళతారు. పరీక్ష పాసవగానే మళ్ళీ వచ్చి కొబ్బరికాయ కొడతారు. చదువుకుంటునప్పుడు తాము ముగ్గురూ వచ్చి కొబ్బరికాయు కొట్టడం జ్ఞాపకం వచ్చింది శ్రీదేవికి, చారుమతికి.

"పద్మ ఎలా ఉందో? నీకేమైనా ఉత్తరాలు రాస్తుదా?" అంది శ్రీదేవి.

"నాకేం రాయదు. వెళ్ళాక ఒకటి రెండు రాసింది. కాని అందులో చదువు విషయం తప్ప ఇంకొకటి లేదు. నాలుగు ముక్కలు రాస్తుంది."

"పద్మ సుఖపడటం లేదనిపిస్తూంది చారూ!"

"అవును, నాకూ అలాగే అనిపిస్తూంది. నీ ఉత్తరాలలో నువ్వు మీ ఆయన్ని గురించి బోలెడు సంగతులు రాస్తావు. హైదరాబాద్ విశేషాలు రాస్తావు. కాని పద్మ వాళ్ళాయన పేరే ఎత్తదు ఎప్పుడూ. మద్రాసు కూడా పూర్తిగా చూసినట్టు అనిపించదు."

ఇద్దరు పద్మ గురించి మాట్లాడుకుంటూ కూర్చున్నారు కాసేపు.

"పద్మ సుఖ పడాలని పెళ్లి రోజునే గుడిలో ప్రార్థించాము, జ్ఞాపకం ఉందా? కాని అదే కరువైనట్టుంది పద్మకి. ఇలాంటివి చూస్తూ ఉంటేనే దేవుడి మీద నమ్మకం పోదూ మరి?" అంది చారుమతి.

"దేవుడి మీద నమ్మకం మాత్రం పోగొట్టుకోకు, చారూ! నాకెంతో నమ్మకం భగవంతుడి మీద."

'ఎవరి అభిప్రాయాలు వాళ్ళవి' అనుకుంది చారుమతి.

బాగా చీకటి పడిందని లేచారు ఐదారు.

"బాబు పుట్టగానే ఉత్తరం రాయి" అంది చారుమతి, శ్రీదేవి రిక్షా ఎక్కుతుంటే.

"ఆ ... అలాగే రాస్తాను. నువ్వూ ఉత్తరాలు రాస్తూడు. అశ్రద్ధ చెయ్యకు" అంది శ్రీదేవి.

ఇద్దరికీ విడిపోవడం కష్టమనిపించింది. శ్రీదేవి రిక్షా బాలాజీ చెరువు రోడ్డు దాటే దాకా అక్కడే నుంచుంది చారుమతి. శ్రీదేవి రిక్షా వెనక తెర ఎత్తి చెయ్యి ఊపింది.

శ్రీదేవిలో ఒక నిండుదనం, ఒక తృప్తి, పెద్దరికం వచ్చాయి. శ్రీదేవినే తలుచుకుంటూ ఇంటి ముఖం పట్టింది చారుమతి. కోవెల దగ్గిర నించి ఇల్లు చాలా దగ్గిర. పది నిమిషాలలో ఇల్లు చేరింది.

వంటింట్లోంచి గట్టిగా మాటలు వినిపిస్తున్నాయి. కాళ్ళు కడుక్కుని, చారుమతి కూడా ఇంట్లోకి వెళ్లి పీట వాల్చుకుని కూర్చుంది. శాంతమ్మ కంచం పెట్టి కూతురికి అన్నం వడ్డించింది. తన రాకతో హఠాత్తుగా ఆగిపోయిన మాటలకి ఆశ్చర్య పోతూ, "ఏమిటి మాట్లాడుతున్నారు?" అంది చారుమతి.

"ఏమీ లేదు. భగవతి ఏదో వాగుతూ ఉంటుంది. మామూలే కదా!" అంది శాంతమ్మ.

"నేనేమైనా తప్పు మాట అన్నానా? నాది వాగుడా?" అంది భగవతి ఉక్రోషంగా.

"తల్లీ! మళ్ళీ పురాణం విప్పకు." శాంతమ్మ విసుక్కుంది.

"నిజం చెబితే పురాణం ఏమిటి? అందరూ అడుగుతూంటే జవాబు చెప్పలేక చస్తునాను. ఇంట్లో ముక్కు మూసుకుని కూర్చున్న నీకేం తెలుస్తుంది?" తల్లి వైపు కోపంగా చూస్తూ అంది భగవతి.

"బయట అందరూ ఏమని అడుగుతున్నారు?" చారుమతి ఆశ్చర్యంగా అడిగింది.

"ఏం మీ అక్కలు పెళ్లి చేసుకోరా? ముసలివాళ్ళు అయ్యేదాకా అలాగే ఉండి పోతారా అంటున్నారు."

"వాళ్ళకెందుకు బాధ? 'పెళ్లికొడుకుల్ని తీసుకు రండి, మా అక్కలు పెళ్లి చేసుకుంటారు' అని చెప్పు నువ్వు." చారుమతి కోపంగా అంది.

"ఊరి వాళ్ళెందుకు చూసి పెడతారు? అమ్మా, నాన్నా చూడాలికాని, అమ్మ కూతుళ్ళ విషయమే పట్టించుకోదు. అయిదుగురు కూతుళ్ళని మాత్రం కంది."

"అస్తమానం అమ్మ విషయం ఎత్తుతావెందుకు? అమ్మ ఏం చేస్తుంది? నీకు బొత్తిగా జ్ఞానం లేదు. మాకు పెళ్ళిళ్ళు కాకపోతే నీకేం బాధ?" ఎప్పుడూ కోపగించుకోని భానుమతి తారాజువ్వలా లేచింది.

"నాకే బాధ. నువ్వయితే సన్యాసినిలా పెళ్ళీ గిళ్ళీ లేకుండా ఉండిపోయావు. మమ్మల్ని అందరినీ అలాగే ఉండమంటావా?" భగవతి రెట్టించింది.

"నువ్వు ఊరుకుంటావా లేదా, భగవతీ? ఏమిటా మాటలు?" శాంతమ్మ కేకలేసింది.

"ఎందుకు ఊరుకోవాలి? అక్కలందరూ ఊరుకున్నారు. కనకనే వాళ్ళంతా పెళ్ళిళ్ళు లేకుండా ఉండిపోయారు. నేను అలా ఊరుకోను. నాకు పెళ్లి చేసెయ్యి."

భగవతి మాటలు విన్న అక్కలకి, తల్లికి నోట మాట రాలేదు. ఆశ్చర్యం, కోపం, అసహాయత్వం అన్నీ వాళ్ళని స్తబ్దుల్ని చేశాయి.

ఎవరి ఆలోచనలో వాళ్ళు ఉండిపోయి, భోజనాలు ముగించి లేదారు. పిల్లందరూ వెళ్ళిపోయాక శాంతమ్మ ఒక్కర్తే నట్టింట్లో కూర్చుని కుళ్ళి కుళ్ళి ఏడ్చింది.

భగవతిని గురించే ఆలోచిస్తూ కళ్ళు మూసుకుంది చారుమతి. భగవతిది ఇంకా అజ్ఞానం వదలని వయస్సు. అలవాట్లు, ఆలోచనలు, చదివే పుస్తకాలు మనిషి ప్రవర్తన మీద ప్రభావం చూవుతాయి. భగవతికి చదువులో కంటె, ఇరుగుపొరుగు ఇళ్ళలో పెత్తనాలు చెయ్యటం ఇష్టం. ఉదయం లేచిన దగ్గిరి నించి సాయంత్రం చీకటి పడేదాకా పొరుగు ఇళ్ళలో గడుపుతుంది. దానికి తోడు ఆమె స్నేహితురాలు సీత ధనవంతుల బిడ్డ. వారి మేడ భగవతి ఇంటికి నాలుగిళ్ళ అవతల ఉంది. రోజులో చాలా భాగం భగవతి సీత తోనే గడుపుతుంది. సీతకి ఇద్దరన్నలు, ఇద్దరక్కలూను. అక్కలకి ఎనిమిదేసి వేలు కట్నం ఇచ్చి, అన్నలు పదేసి వేలు కట్నం తీసుకుని పెళ్ళిళ్ళు చేశారు. సీత ఇంట్లో వారికి భగవతి ఇంటి పరిస్థితులు చూస్తే హేళన. ఆడపిల్లలందరూ పెళ్లి లేకుండా ఇంట్లో ఉండి పోయారని ఈసడిస్తూ మాట్లాడుతారు. ఆ మాటలు విని రెచ్చిపోతుంది భగవతి.

సినిమా కథల పుస్తకాలు, చవకబారు డిటెక్టివ్ పుస్తకాలు మాత్రమే చదివే భగవతిలో సంస్కారం, జ్ఞానం పెరగలేదు.

భగవతిని తలుచుకుని భయపడింది చారుమతి. ఇంటి పరిస్థితులకి, భగవతి కోరికలకి అగాధం అంత అంతరం ఉంది. ఈ అగాధం పైన ఆనకట్ట ఎలా కట్టడం అని నిట్టూర్చింది చారుమతి.

ఇంట్లో అందరూ నిద్ర పోయినా, భానుమతి మేలుకునే ఉంది. నిద్ర పట్టక బయటికి వచ్చి వరండాలో నిలుచుంది. బయట వెన్నెల ఎంతో ఆహ్లాదంగా ఉంది. మనసు సంతోషంగా ఉంటేనే ప్రకృతిలో అందాన్ని ఆస్వాదించగలం. లేకపోతే మనసులోని చీకటి బయటి వెన్నెలని కూడా చీకటిగానే మార్చేస్తుంది.

భానుమతి రెండు అడుగులు ముందుకు వేసి సందులోకి వచ్చింది. ఒక్క నిమిషం ఆగి, వెనక్కి వచ్చి వరండాలో కూర్చుంది. అరగంట తరువాత మళ్ళీ ఒక నిశ్చయానికి వచ్చినట్టు గబుక్కున లేచి గబగబా సందుగుండా ఇంటి ముందు భాగానికి వచ్చి నిలిచింది. తిరిగి ఏదో తటపటాయింపు. కాళ్ళు ముందుకీ వెనక్కి వెళ్ళాయి. చివరికి ముందు గది దగ్గిరికి వెళ్లి తలుపు తట్టింది మెల్లిగా. అప్పటికి రాత్రి పదకొండున్నర గంట అయింది. ఊరంతా సద్దుమణిగింది. వర్షాకాలమేమో, అంతా ఇళ్లలోనే నిద్ర పోతున్నారు.

రామారావుగారు వచ్చి, "ఎవరూ?" అంటూ తలుపు తీసి, గది ముందు ఆడపిల్లని చూసి ఆశ్చర్యపోయారు.

భానుమతి చటుక్కున లోపలి వచ్చంది. లైటు వేసి వచ్చింది. భానుమతి అని పోల్చిన రామారావుగారి ఆశ్చర్యం రెండింతలైంది. బానుమతి ఆయనతో ఎప్పుడూ ఎదటబడి ఒక్క మాట మాట్లాడ లేదు.

"ఏమండీ, ఇలా అర్ధరాత్రి వచ్చారు?"

"ముందర గది తలుపు దగ్గిరికి వేస్తారా?" భానుమతిలో మొండి ధైర్యం కనిపిస్తోంది.

రామారావుగారు తలుపు చేరవేసి వచ్చి, భానుమతికి ఎదురుగా నిలుచున్నారు. 'ఏమిటి సంగతి?' అన్నట్టు ఉన్నాయి ఆయన చూపులు.

"మాస్టారూ! మీరు నన్ను పెళ్లి చేసుకుంటారా?" భానుమతి తొందరగా చెప్పి, ఒక్కసారి ఆయనని చూసి, కళ్ళు దించుకుంది.

"ఏమిటి అంటున్నారు?" అర్థం కానట్టు అడిగారు రామారావుగారు.

"నన్ను పెళ్లి చేసుకోమంటున్నాను, మాస్టారూ!" మృదువుగా చెప్పింది భానుమతి.

రామారావు కాసేపు భానుమతినే చూస్తూ నిలుచున్నారు.

"మీ వయస్సెంత?"

"ఇరవై ఏడు వస్తాయి."

"నా వయస్సెంతో తెలుసా? నలభైరెండు. అంటే మనిద్దరికీ పదిహేను ఏళ్ళు తేడా. మీరే చెప్పండి, మిమ్మల్ని పెళ్లి ఎలా చేసుకోమంటారో?"

"ఎందుకు చేసుకోకూడదూ? మా పెద్దమ్మకి, పెదనాన్నకి ఇరవై ఏళ్ళు తేడాట." భానుమతి తలవంపుకుని పైటచెంగు వేలికి చుట్టుకుంటూ చెప్పింది.

"ముందర మీరు కూర్చోండి. ఇంత హఠాత్తుగా ఇలాంటి నిర్ణయానికి ఎందుకు వచ్చారో వివరంగా చెప్పండి" అన్నారు రామారావుగారు, భానుమతికి కుర్చీ చూపిస్తూ.

భానుమతి కూర్చుని వరసగా తమ కుటుంబం పరిస్థితి, తండ్రి చనిపోవడం, ఆర్థికమయిన ఇబ్బందులు, ఆడపిల్లల పెళ్ళిళ్ళ సమస్యలు వరసగా వివరించి చెప్పింది రామారావుగారితో. టేబిల్ మీద రెండు చేతులు ఆనించుకుని కుతూహలంగా విన్నారు ఆయన. మెల్లగా ఉన్నా భానుమతి కంఠస్వరం మధురంగా ఉంది. నిశ్శబ్ద ప్రకృతిలో దూరదూరాలనించి వినిపించే తీయని వేణుగానం వింటున్న అనుభూతి కలిగింది ఆయనకి.

అంతా విని నవ్వుతూ, "అయితే మీ చెల్లెళ్ళ పెళ్లి కోసం మీ జీవితాన్ని త్యాగం చేసుకుంటారా? నన్ను పెళ్లి చేసుకోవాలనుకుంటున్నారా?" అన్నారు రామారావుగారు.

"మిమ్మల్ని భర్తగా పొందడం కంటె గొప్ప అదృష్టం వేరొకటి ఉండదు" అంది భానుమతి.

"అలా అని మిమ్మల్ని మీరు మోసం చేసుకుంటున్నారేమో?"

"మాస్టారూ! ఇది నేను ఇవాళ హఠాత్తుగా చేసుకున్న నిర్ణయం కాదు. మీరు మీ కథ శంకరానికి చెబుతూంటే నేను విన్నాను. ఆ రోజే నేను నా భర్తగా ఎవరిని పొందాలో నిర్ణయించుకున్నాను. ఇన్ని రోజులూ మౌనంగా ఉండడానికి కారణం స్త్రీ సహజమైన నా సిగ్గు. మీరు అపార్థం చేసుకుంటారేమోనని భయం. మీరు నన్ను భార్యగా స్వీకరించడానికి అంగీకరిస్తే, నేను చాలా ధన్యురాలిని."

రామారావుగారు భానుమతిని చూస్తూ కూర్చున్నారు. అమాయకంగా కనిపించే ఆ ముఖం వెనక ఎంత నిగూఢత్వం! ఎంత ధైర్యం! ఎంత మనస్సు నిబ్బరం!

భానుమతి ఒక చెయ్యి టేబిల్ మీద వేసి, రెండో చేతితో వీపుమీద నించి కప్పుకున్న పైట చెంగు పట్టుకుంది. తలవంచుకుని కదలకుండా బొమ్మలా కూర్చుంది.

రామారావుగారు భానుమతి చెయ్యిమీద తన చెయ్యి ఉంచి, "నిన్ను నేను తప్పక పెళ్లి చేసుకుంటాను భానుమతీ! మోడుగా ఉన్న నా జీవితంలో ఒకనాడు అమృతం కురుస్తుందని నేను ఎప్పుడూ ఊహించలేదు" అన్నారు. ఆయన చేతిలోని భానుమతి చెయ్యి వణికింది. ఆమె కళ్ళనించి జలజలా కన్నీరు ప్రవహించింది. రామారావుగారు భానుమతి పక్కకి వచ్చి ఒక చెయ్యి ఆమె భుజం మీద వేసి, రెండో చేత్తో ఆప్యాయంగా కన్నీరు తుడిచారు.

గంట తరువాత భానుమతి నిశ్శబ్దంగా తమ ఇంటి భాగం లోకి వచ్చి, తలుపు తీసుకుని గదిలో ప్రవేశించడం ఎవ్వరికీ తెలియదు.

## *23*

"పద్మకు,

ప్రేమతో చారు ఉత్తరం.

నీకు ఉత్తరం రాసి ఎన్నో రోజులైయింది పద్మూ! ఇంత హఠాత్తుగా పెద్ద ఉత్తరం ఎందుకు రాస్తున్నాననుకున్నావు? మంచి సంతోష వార్త ఉంది. భానక్కకి నిన్న పెళ్లి అయింది. బావగారి పేరు రామారావుగారు. ఈ ఊళ్లోనే హైస్కూలులో లెక్కల మాస్టారు.

పెళ్లి ఎలా అయింది? సంబంధం ఎవరు చెప్పారు? పెళ్లి ఎక్కడ జరిగింది? అంటూ ప్రశ్నలు అడుగుతావు. నాకు తెలుసు. అన్నిటికీ ముందే నేను జవాబు రాసేస్తాను.

పది రోజుల కిందట ఒక రోజు సాయంత్రం అమ్మ నాతో మెల్లగా చెప్పింది. 'భానుమతి మాస్టారిని పెళ్లి చేసుకుంటుందట. వాళ్ళిద్దరికీ ఇష్టమేనట' అని. నాకు ఆశ్చర్యం వేసింది. వింత అనిపించింది. మాస్టారు మాఇంట్లో అద్దెకి ఉంటున్నారు. ఆయన వయస్సు నలభై దాటి ఉంటుంది.

భానక్కని నేను ఒంటరిగా డాబా మీదికి లాక్కు వెళ్లి అడిగాను. "నువ్వు ఎవరిని చేసుకుంటున్నావో తెలుసా? ఎందుకు చేసుకుంటున్నావు?

"నేను మాస్టారిని చేసుకుంటున్నాను. ఎందుకు చేసుకుంటున్నావు అని అడగడంలో అర్థం లేదు చారూ! ప్రతి స్త్రీకి ఒక పురుషుడు కావాలి. అందుకే పెళ్లి అవసరం."

భానక్క జవాబు విని నేను కోపం తెచ్చుకున్నాను.

"స్త్రీకి పురుషుడు అవసరమని నాకు చెప్పనవసరం లేదు. దాని కోసమని వయస్సు, వావి లేకుండా పెళ్లి చేసుకోవడమేనా? ఆయన నీ కంటె ఎంతో పెద్దవారు!"

"ఎంత పెద్దవారని నీ ఊహ చారూ? నా కంటె పదిహేనేళ్ళు పెద్ద. మన పెద్దమ్మకి, పెదనాన్నకి ఇరవై ఏళ్ళు తేడా అని అమ్మ చెప్పింది. గుర్తు లేదూ?" నవ్వుతూ అంది భానక్క.

"అయినా ఎవరి కోసం ఈ త్యాగం భానక్కా? నువ్వు తొందరపడుతున్నావేమో?" అన్నాను నేను.

"ఇందులో నా త్యాగమేమీ లేదు. మాష్టారంటే ముందర నించీ గౌరవం నాకు. ఆయనని భర్తగా పొంద గలగటం నా అదృష్టం."

భానక్క కళ్ళలో వెలుగు చూసిన నేను ఇంకా ఏమీ మాట్లాడ లేక పోయాను.

"కానీ భానక్కా! ఏమీ అనుకోను అంటే ఒక్క మాట అడుగుతాను, చెప్పు. మాస్టారే నిన్ను అడిగారా పెళ్లి చేసుకోమని?" అన్నాను చివరికి.

"లేదు చారూ! నేనే మాస్టారిని అడిగాను. మన జీవితానికి ఒకటి కావాలని అనుకున్నప్పుడు, అందులో అధర్మం, తప్పు లేదనే నిశ్చయం మనకి ఉన్నప్పుడు. దాన్ని సాధించటం కోసం ప్రయతించటంలో, ధైర్యం చెయ్యటంలో తప్పు లేదనిపిస్తుంది నాకు. ఎవరో పైవాళ్ళు వచ్చి మన జీవితాన్ని సరిదిద్దుతారని, మన సమస్యలని తీరుస్తారని చేతులు ముడుచుకుని కూర్చునే కంటె, మనమే మన సమస్యలని పరిష్కరించు కోవటం వివేకం కదూ?"

భానక్క ధైర్యానికి, వివేకానికి మనసులోనే జోహారులర్పించాను పద్మా. భానక్కకి ఉన్న నిబ్బరం, ధైర్యం చదువుకున్న మనలో ఎవరికేనా ఉన్నాయంటావా?

మాస్టారికి వయస్సు ఎక్కువ తప్ప, తక్కిన విషయాలలో ఆయన మణిపూస లాటివారు. ఆయన మా బావగారవడం మా అదృష్టం.

నిన్న ఉదయం భానక్క పెళ్లి అన్నవరం కొండ మీద సత్యనారాయణమూర్తి సన్నిధిలో జరిగింది. పెళ్లి చాలా నిరాడంబరంగా జరిగింది. ఇక్కడినించి నేను, మాలతి, భగవతి వెళ్ళాము. విశాఖ నించి రేవతక్క, బావ వచ్చారు. విజయవాడ నించి మాస్టారి చెల్లెలు, భర్త వచ్చారు.

ఇవాళ అందరం తిరిగి వచ్చాం. భానక్క, బావగారు నమస్కారం చెయ్యగానే మామ్మకి ఎంత ఆనందమైంది అనుకున్నావు! భానక్కని చేర్చుకుని ఆనంద భాష్పాలు రాల్చింది ఆవిడ. ఇంకా ఆశీర్వచనాలు చెప్పనవసరం లేదు. సంతోషం సగం బలం అంటారు అది ఎంతో నిజమని మామ్మని చూస్తే తెలుస్తుంది. ఇవాళ ఆవిడ మంచం మీద నించి లేచి కూర్చోగలుగుతుంది. శంకరం వెళ్లి పోయిన దగ్గిర నించి ఆవిడకి మాస్టారంటే ఎంతో అభిమానం. ఈ రోజు ఆయనే అల్లుడుగా లభ్యమైనందుకు ఆవిడికి చాలా ఆనందంగా ఉంది. ఒక్కటే లోపం మాకు. నాన్న లేరు. శంకరం మా ఆనందంలో పాల్గొన లేదు.

పద్మా! నాన్న చనిపోయిన ఇన్నాళ్ళకి మా ఇంట్లో మనుష్యులు నవ్వటం జ్ఞాపకం చేసుకున్నారు. మనసులో ఒక సంతోషం కలిగినా, ఒక అందమైన వస్తువుని చూసినా, ఆ అనుభవం ఇష్టమైన వాళ్ళతో పంచుకోవాలనే భావన కలుగుతుంది. అందుకే నీకు, శ్రీదేవికి ఈ రోజే ఉత్తరాలు రాస్తున్నాను.

ఇప్పటికే చాటభారతమంతైన ఈ ఉత్తరం ఇంక ఆపుతున్నాను. నువ్వు నీ సంగతులన్నీ వివరంగా రాయి. పరీక్షలై పోగానే నువ్వు తప్పక కాకినాడ రా. నిన్ను చూసి రెండేళ్ళు అయిపోతూంది. పదిరోజుల కిందట శ్రీదేవి వచ్చింది దానికి రెండు నెలలలో బాబు పుట్టబోతున్నాడు. మరి నువ్వెప్పుడిస్తావు పాపని?

ఉంటా.

చారు."

పద్మ ఉత్తరం మడిచి పుస్తకంలో పెట్టి, లైటార్పి పడుకుంది. ఆ ఉత్తరం చదవటం పద్మకి నాలుగోసారి. భానుమతికి ఉన్న తెగువ తనకి లేదెందుకని? అని ఆలోచిస్తూ పడుకుంది.

( కొనసాగింపు వచ్చేనెలలో)

Post your comments